# చేతిలోని యే రేఖా చెప్పలేకపోయింది

## టి.యస్.యస్. రంగనాథ్



''నేను ఎవర్ని ?''

అన్నది వేదాంత చర్చకు మూల ప్రశ్న.

భౌతికంగా అయితే — నేను మిస్టర్ 'యక్స్' నని, ఫలాన 'సెక్స్'నని, 'వై' కులస్థుడ్నని, 'జడ్' అంతస్థులోవాణ్ణని అందరం అనుకుంటుంటాం.

కానీ, గాలిపాలైన అనాధలకు అవన్నీ అనుకునే అవకాశాలెలావుంటాయ్ — పాపం !

* * *

అదో వూరు. ఆ వూళ్ళో ఏ పేరుతో పిలిచినా -- 'ఒరేయ్' అన్నా — బూతుగా పిలిచినా పలికే పధ్నాలుగేళ్ల పసివాడు 'వాడు'. వాడికి తెలిసిందల్లా తను మగాడినని.

వాడికున్న ఆరాటమల్లా — తన మగితనాన్ని ఓ గుడ్డలాంటి దాని మరుగున దాచాలని, ఆకలేస్తే అన్నంలాంటిదేదైనా మింగాలని.

ఆ వూళ్ళో యెవరేం పని చెప్పినా చెయ్యడం, యేదైనా యిస్తే తినడం, అంతే వాడి 'జీవితం' — 'జీవనం'.

ఎప్పుడో పన్నెండేళ్ళక్రితం, ఎవడో సన్యాసితో ఆవూరొచ్చాడు. వచ్చిన పదిరోజుల్లో ఆ సన్యాసి చచ్చాడు. దాంతో ఆ రెండేళ్ళ పసివాడు వూటకో యింట పెరిగాడు.

కాళ్ళూచేతులు తన స్వాధీనంలోకి వచ్చీరాగానే వాళ్ళందరూ ఋణం తీర్చుకోమన్నారు. అదిం కావాడు యీనాటికీ తీరుస్తూనే వున్నాడు — వూరందరికి 'వెట్టిచాకిరీ' చేస్తూనే వున్నాడు.

ఆ వూళ్ళో చాలమందినోట వాడు ''జాతకం శాస్త్రి'' అనేపేరు వింటున్నాడు. అతనెవరో ఆ వూరికి పదిమైళ్ల దూరానవున్న టౌన్లో వుంటాడట, పదిరూపాయలు తీసుకుంటాడట, జరగబోయేవన్నీ చెబుతాడట, ఆయన చెప్పినవన్నీ జరుగుతాయట అని అందరూ అనుకోవడం విన్నాడు.

ఓ పున్నమిరాత్రి, చెరువుగట్టుమీద పడుకుని చందమామకేసి చూస్తూ తెల్లార్లూ ఆలోచించాడు. ఏమాలోచించగలడు ? వాడిది అమావాస్య మెదడు. తెల్లార్లూ జాతకం శాస్త్రి గురించి విన్నవే చెవుల్లో మోగుతున్నాయ్. తెల్లవారు ఝామున వాడికని పించింది—జాతకం శాస్త్రికి పదిరూపాయలివ్వాలని.

ఆ మరునాటినుంచి ఎవరైనా పనిచెబితే చేసేసి, పదిరూపాయలు యిమ్మనడం ప్రారంభించాడు.

'పిచ్చివెధవ'...ఫర్వాలేదు. మనం వాడ్నేం అన్నా వాడికి కోపం రాదులెండి. అన్నీ వాడికలవాటే ... అయినా వాడిప్పుడు ప్రాణాలతో కూడ లేడుగా ...! ఆ పిచ్చివెధవకేం తెలుసు పదిరూపాయలంటే — ఈ రోజుల్లో పదిరూపాయల కోసం 'మానం' బజారులో నిలబడుతోందని, పదిరూపాయల కోసం ప్రాణాలు కూడా పోతున్నాయని వాడికేం తెలుసు ?

వాడికి పదిరూపాయలు కావాలి — పన్లుచేసి అడుగుతున్నాడు. అంతేగాని అడుక్కోడం లేదు. అంతే...అదే పెద్దనేరంగా వూరంతా పాకిపోయింది. అప్పులకింద పేదోళ్ల అస్థికల్లాంటి ఆస్థుల్ని కూడ స్వంతం చేసుకుంటూ బ్రతుకుతున్న ఓ మోతుబరి ''అమ్మమ్మో ! దేశం పాడైపోతోంది'' అని వాపోయాడు.

అప్పట్నించి వూరంతా వాడిని అసహ్యించు కొంటోంది. కానీ, పన్లు చెప్పడం మానలేదు.

వాడు పన్లుచేస్తూనేవున్నాడు—పదిరూపాయలు అడుగుతూనే వున్నాడు.

అడగ్గా అడగ్గా కొన్నాళ్లకు ఐదుపైసలు, పదిపైసలు పడెయ్యడానికి అతికష్టంగా ముందు కొచ్చారు, మహత్తర మానవజాతికి చెందిన ఆ వూరి వారు.

అలా అలా కొన్నాళ్లకు గుప్పెడు చిల్లర పోగైంది.

ఓ రోజు ''పదిరూపాయలంటే యెంత ?'' అని ఎవర్నో అడిగాడు వాడు. సమాధానంగా అతను రెండు చేతులూ చూపించి వెళ్లిపోయాడు.

వాడికది అర్థంగాక తన రెండుచేతులూ చూసుకున్నాడు. వాడి హస్తాలు రెండు దగ్గరగ కనిపించేసరికి, రెంటినీ కలిపి ''ఓహో ! దోసెడంత కాబోలు'' అనుకున్నాడు. మరి కొన్నాళ్లకు వాడి దోసిలినిండింది.

గుడి దగ్గరికి పరుగెత్తి ''ఇది పదిరూపా

యలా?'' అని పూజారినడిగాడు. నిత్యం ''రామ నామం'' జపించే ఆ పూజారి తీరిగ్గా కూర్చొని చిల్లరంతా లెక్కపెట్టి, ''పధ్నాలుగు రూపాయల అరవై పైసలు బాబూ!'' అన్నాడు. ''పదిరూపాయలు కావా ?'' అన్నాడు దిగాలుగ వాడు. ''నీకు పదిరూపాయలు కావాలా ?'' అని పూజారి అడిగితే, అవునన్నట్లు తలూపాడు.

పూజారి అందులోంచి నాలుగు రూపాయల అరవై పైసలు తీసి బొడ్లో దోపుకుంటూ ''ఆది పదిరూపాయలు పట్టుకుపో'' అని మిగిలిన చిల్లర చూపించాడు. వాడా చిల్లర ఆనందంగా యేరుకుని జాతకం శాస్త్రి కోసం పరుగుతీశాడు. పూజారి 'రామనామం' జపిస్తూ గుడిగంట కొట్టాడు.

కనుక్కుంటూ, వెతుక్కుంటూ శాస్త్రియిల్లు చేరాడు మనవాడు. మాసిపోయి, చినిగిపోయి వేలాడే బట్టల్లో – బ్రతుకుమీది ఆశతో వేలాడే వాడిరూపు జాతకశాస్త్రి కడుపు కెలికింది.

''ఎవరుబాబూ నువ్వు ? ఏం కావాలి ?'' అని అడిగాడు శాస్త్రి ప్రేమగా.

''ఇదిగో పదిరూపాయలు'' అంటూ దోసిలి ముందుకు చాపాడు వాడు. దోసిట్లోవున్న చిల్లర చూసి శాస్త్రి ''జాతకం చెప్పాలా ?'' అన్నాడు జాలిగా. వాడు ఆశగా తలూపాడు. ''కూర్చో. ఆ డబ్బక్కడుంచు'' అని శాస్త్రి అంటే, వాడా చిల్లర శాస్త్రి ముందుపోసి తను ఎతని కెదురుగ–కుదురుగ కూర్చున్నాడు.

''ఏదీ, చెయ్యి చూపించు'' అన్నాడు శాస్త్రి కళ్ళజోడు పెట్టుకుంటూ. వాడు రెండు చేతులూ చాపాడు. శాస్త్రి నవ్వుకుంటూ వాడి కుడిచెయ్యి నందుకోగా వాడు యెడం చెయ్యి లాక్కున్నాడు. శాస్త్రి చెయ్యి చూస్తున్నాడు.

మొరటువారిన వాడి చేతిలో లెక్కలేనన్ని రేఖలు.

చెయ్యిబోతే చేతుల్ని – కదలబోతే కాళ్ళని
కట్టిపడేసే రేఖలు. అవి కడుపు కాల్చే రేఖలు.
ఎండు ముళ్ళతీగలా చేతినిండా అవే రేఖలు.

శాస్త్రికేదో అనిపించి వాడికేసి చూసి ''తల్లి దండ్రుల దగ్గర పెరిగే జాతకం కాదు నాయనా నీది'' అంటూ వాడి కళ్ళల్లోకి చూసి, మౌనంగా



సినీ నటుడు–రచయిత: రంగనాథ్

తలవాల్చి యేదో ఆలోచించి మళ్ళీ రేఖలు చూడ సాగాడు.

''అరె! ఎలా తెలిసిపోయిందబ్బా!'' అని ఆశ్చర్యపోయాడు వాడు. శాస్త్రి, అదేదో రేఖని పదే పదే చూసి దారంపెట్టి కొలిచి పెదవి విరిచేశాడు.

శాస్త్రి ఆందోళనతో వాడి ముఖంలోకి చూశాడు. వాడు మునుపటి ఆశ్చర్యంలోనే వున్నాడింకా.

''బాబూ! నీకు చెప్పవలసింది ఒక్కటే వుంది. అది చెప్పడానికి నాకు బాధగావుంది.'' అంటూ నుదురుమీద రుద్దుకున్నాడు శాస్త్రి. వాడు ఏ మార్పూలేకుండ శాస్త్రివైపు చూస్తున్నాడు. శాస్త్రి వాడివైపు చూడకుండా ''ఆ డబ్బు తీసుకో బాబూ!'' అంటే – అదే పద్ధతేమోనని వాడు చిల్లరంతా యేరాడు. శాస్త్రి జాలిగా వాడికేసి చూస్తూ ''ఈ వారంలో నీకు మరణగండముంది'' అన్నాడు మెల్లగా. ''అంటే ?'' అని అర్ధంగాక వాడన్నాడు.

''ప్రమాదం జరిగి నువ్వు చచ్చిపోవచ్చు'' అని ఆగిపోయాడు శాస్త్రి. వాడి ముఖంలో కొద్దిగా మార్పువచ్చింది. ఏదో చీకటి వాడికళ్ళల్లో దోబూచులాడింది.

''ఖంగారు పడక బాబూ!'' అని వాడిభుజం తడుతూ శాస్త్రి ''ఈ వారంలో గనుక ఏమీ జరక్కపోతే ఆ తర్వాత నువ్వు రాజాలా బ్రతుకుతావు. కావలసినంత డబ్బు సంపాదిస్తావు, లెక్కలేనన్ని యిళ్ళు, పొలాలు కొంటావు – హాయిగా వుంటావు.'' అని ముగించాడు. వెంటనే మళ్ళీ ''ఈ వారం రోజులుమాత్రం జాగ్రత్తగా వుండునాయనా!'' అని హెచ్చరించి వెళ్ళిరమ్మన్నాడు. వాడి కళ్ళల్లో చీకటి మాయమైంది.

శాస్త్రి చెప్పిన వారంతర్వాత వ్యవహారం తలచుకుంటూ ఆనందంగా అక్కడ్నించి కదిలాడు.

వెళ్ళిపోతున్నవాణ్ణి, కళ్ళజోడు తీసి చూస్తూ, ''వాడికేం ప్రమాదం రాబోతోందా?''అనే ఆలోచనలో పడ్డాడు శాస్త్రి.

అంతలో కస్సుమని బస్సొకటి ఆగింది. ఎక్కడో దున్నపోతు వికృతంగా అరిచింది.

బస్సు బ్రేక్ శబ్దానికి శాస్త్రి ఆలోచనల్లోంచి బయటపడ్డాడు. జనం అరుపులు, కేకలు విని అక్కడికి పరుగుతీశాడు.

బస్సు చుట్టూ అల్లరి, జనం – బస్సు కింద కుర్రాడు. వాడి చుట్టూ చిల్లర డబ్బులు – వాడి చేతిలో ముళ్ళరేఖలు.

''అబ్బా!'' అంటూ శాస్త్రి నుదురు బాదుకున్నాడు.

తలచిట్లి మెదడు సగం బయటకు వచ్చి రక్తపు మడుగులో ప్రాణంపోయి పడున్నవాడ్ని చూస్తూ ...

''వీడికీ క్షణంలోనే గండం వుందని తెలుసుకోలేకపోయానే – నా పాండిత్యాన్ని తగలెయ్య'' అని మనస్సులో ఎంతగానో తన పాండిత్యాన్ని తిట్టుకున్నాడు.

కానీ – అసలు నిజం తెలిసుంటే అతని గుండె ఏమయ్యేదో! చిన్నప్పుడు జాతరలో తప్పిపోయి తిరుగుతున్న ''తన కొడుకే వాడ''న్నది చేతిలోని యే రేఖా చెప్పలేకపోయింది!? ★




